క్లుప్తంగా

అన్నదానం



జనగామ: ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని పట్టణంలోని 27వ వార్డులో ఉప్పలమ్మ సహిత ఆంజనేయస్వామి ఆలయంలో పూజారి వారణాసి పవన్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి శాకంబరీ కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, ఈఓ చిందం వంశీ, కూరగాయల లింగయ్య, ఓరుగంటి ఆంజనేయులు, చెంచారపు బుచ్చిరెడ్డి, మార్గం రవి, కూరగాయల మహేష్, చెంచారపు భరత్ రెడ్డి, వేముల్ల సురేష్ రెడ్డి, ఎర్రం ప్రసాద్, శ్రీనివాస్, మహేష్ ఠాకూర్ స్వామి పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏసీపీ పూజలు



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో దేవతలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ లగిశెట్టి భిక్షపతి ఏసీపీని శాలువాలతో సత్కరించారు. జనగామ రూరల్ సీఐ సంతోష్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: రైతుబంధు సమితి మండల ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా మండలంలోని రంగరాయగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తోట వెంకన్నను నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తోట వెంకన్న ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి రైతుబంధు సమితి మండల ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా నియమించిన ఎమ్మెల్యే రాజయ్యకు, సహకరించిన జెడ్పీటీసీ మారపాక రవి, పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల కుమార్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంఘం భవనానికి స్థలం కేటాయించాలి



బచ్చన్నపేట: జిల్లా కేంద్రంలో పెరిక సంఘం నూతన భవనం నిర్మించడానికి స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తినేని వెంకటరమణ కోరారు. సోమవారం హనుమకొండ క్యాంప్ కార్యాలయంలో మంత్రి దయాకర్ రావును కలిసి పూలేబొకే అందజేసి పలు సమస్యలతోకూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు బోడకుంటి మల్లయ్య, పేరం రాము, మాడిశెట్టి కృష్ణమూర్తి, సందెల బాలసిద్దులు, మల్యాల హరినాథ్, ఈర్ల శివరాములు పాల్గొన్నారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు, కొడకండ్ల మార్కెట్ డైరెక్టర్ మైదం జోగేశ్వర్‌కు మాతృవియోగం జరిగింది. మృతురాలు సుశీలమ్మ మృతదేహానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. దయాకర్, రవి, సుందర్‌రామిరెడ్డి, మల్లేషమ్, సోమన్న, పద్మవెంకటేశ్వర్లు, సుజాత మలికార్జున్, అర్జున్ ఉన్నారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

రఘునాథపల్లి: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడిన ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెల్దిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గీతకార్మికుడు కొలుపునూరి యాదగిరి రోజు వారిగా ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడ్డాడు. దీంతో పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలపాలైన యాదగిరిని సహచర గీత కార్మికులు గుర్తించి వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందజేసి ఆదుకోవాలని గ్రామ గౌడ సంఘం నాయకులు కోరారు.

రాజవరంలో..

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు రంగు మొండయ్య ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు రంగు రవి కుటుంబ సభ్యుల సహకారంతో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సొసైటీల ద్వారా డెయిరీ నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విజయడెయిరీకి చెందిన ఘన్‌పూర్ పాలశీతలీకరణ కేంద్రం(బీఎంసీయూ)ను సొసైటీల ద్వారా నిర్వహించేలా సొసైటీ మోడ్‌లోకి మార్చాలని కృష్ణాజీగూడెం, ఫత్తేపూర్, గార్లగండ తండా సొసైటీల అధ్యక్షులు సాదం రమేష్, వడ్లూరి వెంకటాద్రి, భూక్య శ్రీను డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో మొత్తం ఎనిమిది బీఎంసీయూలు ఉండగా అందులో ఆరు సొసైటీల ద్వారానే నడుస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పాలసేకరణను పెంచేందుకు గాను పాలశీతలీకరణ కేంద్రాలను సొసైటీ మోడ్‌లోకి మార్చేందుకు సానుకూలంగా ఉండగా ఈనెల 12న ఘన్‌పూర్ బీఎంసీయూ పరిధిలోని వివిధ సొసైటీల అధ్యక్షుల సమావేశాన్ని ఘన్‌పూర్‌లో నిర్వహించామన్నారు. ఆ సమావేశంలో ఘన్‌పూర్ బీఎంసీయూను సొసైటీ మోడ్‌లోకి మార్చాలని, ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇవ్వాలని, పాడి రైతులకు రూ.10వేలు సబ్సిడీ, బీఎంసీయూ నిర్వహణ ఖర్చు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. సదరు తీర్మాణాన్ని విజయడెయిరీ జిల్లా డీడీ ధన్‌రాజ్‌కు పంపామని, ఈ విషయమై ఇంతవరకూ స్పందన లేదన్నారు. డీడీ పనితీరు బాగా లేదని, పాడి రైతులు విజయడెయిరీకి పాలు పోస్తామంటున్నా ఉద్దేశపూర్వకంగా వద్దంటున్నారన్నారు. ఘన్‌పూర్ బీఎంసీయూ సొసైటీ మోడ్‌లోకి రాకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న విజయ డెయిరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్‌పై సంబంధిత ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సాదం రమేష్

పేదలకు గూడు కల్పనలో ప్రభుత్వం విఫలం

దేవరుప్పుల: నిలువనీడ లేని పేదలకు గూడు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీపీసీసీ సభ్యులు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణనాయక్ విమర్శించారు. సోమవారం మండలంలోని మాధాపురంలో ఇటీవల మృతిచెందిన బెజుగం చిన్న ఎల్లయ కుటుంబానికి ఆర్థికసాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్రూం పథకం డెమోగా తయారైందన్నారు. మాజీ సీఎం, దివంగత రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాజకీయాలకతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఏకకాలంలోపంట రుణమాఫీ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చిలుకాని శ్రీశైలం, ఎనుగూతల కొమురయ్య, గుర్రం అంజయ్య, సోమయ్య, బెజుగం సోమకొండయ్య,మొటిక ఐలుమల్లు, చిలుకాని యాకయ్య, జట్టీయాద సోమయ్య, లాకావత్ భాగ్యనాయక్, యాకు, హన్మంతు, ప్రవీణ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న లక్ష్మీనారాయణనాయక్

లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేయాలి



నూతన కార్యవర్గంతో గోపాల్‌రెడ్డి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: లయన్స్‌క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా విస్తృతం చేయాలని క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వంగాల గోపాల్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ 30వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి డివిజన్ కేంద్రంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా యువాన్‌జాన్, కార్యదర్శిగా ఆమంచ నిర్మల, కోశాధికారి ఎం.మంజులరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులచే క్లబ్ మాజీ జిల్లా గవర్నర్, ఇనస్టాలేషన్ ఆఫీసర్ సురభివాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సేవయే పరమావధిగా లయన్స్‌క్లబ్ ఏర్పడిందని, నిస్వార్థంగా చేసే సేవతో కలిగే ఆత్మసంతృప్తి అనిర్వచనీయమైందన్నారు. మహిళలు విధులు సక్రమంగా నిర్వహిస్తారని, ఘన్‌పూర్ నూతన క్లబ్ మహిళ కార్యవర్గం ఎన్నుకోబడటం అభినందనీయమన్నారు. మహిళల నాయకత్వాన్ని క్లబ్ బాధ్యులు ప్రోత్సహించాలని, లయన్స్ అంతర్జాతీయ సంస్థ గవర్నర్, మహిళ అయిన లయన్ పాటిహిల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని నూతన క్లబ్‌కు సూచించారు.

చెట్ల పెంపకం, విద్య, వైద్యంలో సేవలు అందిస్తా..

ఘన్‌పూర్ క్లబ్ గత 30 ఏళ్లుగా సేవలు అందిస్తుందని, తాము ప్రస్తుతం చెట్ల పెంపకం, విద్య, వైద్యపరంగా సేవలు అందించి జిల్లాలో ఉత్తమ స్థానంలో ఉంటామని నూతన క్లబ్ అధ్యక్షురాలు యువాన్ జాన్ అన్నారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఆమంచ మధుసూదన్, కేసీ జాన్‌బన్నీ, ఎండీ.ఖాజామోహినోద్దీన్, రాపాక విజయ్, ఎం.కరుణాకర్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, గుండేటి సంపత్, గట్టు రమేష్, పి.వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణలో విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని శివునిపల్లి రైతువేదికలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శివునిపల్లి క్లస్టర్ రైతుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జెడ్పీటీసీ మారపాక రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేహాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్ పతనం ఖాయమైందన్నారు. ధరణిని రద్దు చేస్తానని, ప్రగతిభవన్‌ను పేల్చివేస్తానని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబు తొత్తుగా, ఏజెంట్‌గా వ్యాఖ్యలు చేస్తున్నారని, వ్యవసాయం దండుగ అన్న టీడీపీకి, చంద్రబాబుకు పట్టిన గతే కాంగ్రెస్‌పార్టీకి పడుతుందన్నారు.

రైతుబంధు డబ్బుల పంపిణీ

మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన రైతు శివరాత్రి మల్లయ్య ఇటీవల మృతిచెందగా అతడి భార్య పూలమ్మకు రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు కింద వచ్చిన రూ.5లక్షలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖగట్టయ్య, ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీలు సింగపురం దయాకర్, గుర్రం రాజు, శివునిపల్లి రైతు కోఆర్డినేటర్ గుర్రం శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యనిపుణులను నియమించాలి



రాస్తారోకో చేస్తున్న సోమయ్యను అదుపులో తీసుకుంటున్న పోలీసులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని విభాగాలకు సంబంధించిన ప్రత్యేక వైద్యనిపుణులను నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ప్రధాన రహదారిపై సీపీఎం నాయకులు, కార్యకర్తలు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జఫర్‌గఢ్‌లో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసిప్పటికీ వైద్యానికి సంబంధించిన అన్ని విభాగాలకు వైద్యులను నియమించలేదన్నారు. పేరుకే పెద్దాస్పత్రి అన్నట్లుగా తయారైందన్నారు. వైద్యనిపుణులను ఇప్పటి వరకు నియమించకపోవడంతో రోగులు ప్రైవేట్ అస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అస్పత్రికి సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ రాస్తారోకోలో పార్టీ నాయకులు ఎండి షభాన, కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, గుండె బోయిన రాజు, వెంకటమ్మ, సిద్దం సోమన్న, శ్రీనివాస్, కొంరయ్య, వడ్లకొండ రాజు, శంషోద్దీన్, వేల్పుల రవి, రాపర్తి ఊర్మిల, ఎర్ర రవితోపాటు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



జనగామ రూరల్: భిక్షాటన చేస్తున్న కార్మికులు

జనగామ రూరల్/రఘునాథపల్లి/తరిగొప్పుల/చిల్పూరు/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల/లింగాలఘణపురం: తమ సమస్యలు పరిష్కారించాలని పంచాయతీ కార్మికులు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా 12వ రోజు సోమవారం డప్పు చప్పుళ్లతో భిక్షాటన చేపట్టారు. పలు మండలాల్లో వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీపీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.19వేలు అందించాలని, జీఓ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు జంగిటి నరేష్, మిన్నాలపురం జలేందర్ తదితరులు ఉన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌నగర్ వాటర్ ఫౌంటెయిన్ పూర్తి చేయండి

జనగామ: పట్టణంలోని సంజయ్‌నగర్ వాటర్ ఫౌంటెయిన్ పనులను పూర్తి చేయాలని సీపీఐ నాయకుడు మంగళ్లపల్లి జనార్ధన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏడాది గడిచిపోతున్నా ఫౌంటెయిన్‌ను పట్టించుకోడం లేదన్నారు. దీంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి, దుర్గంధం వెదజల్లుతుందన్నారు. సుందరీకరణపై నిర్లక్ష్యం, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు అలసత్వం వీడాలని అన్నారు.



అసంపూర్తిగా ఉన్న ఫౌంటెయిన్ పనులు

సర్పంచ్ ఆధ్వర్యంలో చెత్త సేకరణ

జనగామ: జీపీ కార్మికులు సమ్మె బాటలో ఉండడంతో.. గ్రామంలో పేరుకు పోతున్న చెత్తను తొలగించేందుకు మండలంలోని వెంకిర్యాల సర్పంచ్ కీర్తి నర్సయ్య సోమవారం క్షేత్రస్థాయిలో చెత్త సేకరణ చేశారు. పంచాయతీ ట్రాక్టర్‌ను ఇంటింటికీ తీసుకు వెళ్లి, పలువురు గ్రామస్తులు, వార్డు సభ్యుల సహకారంతో చెత్తను సేకరించారు. వార్డు మెంబర్లు ఇరుగు యాకన్న, తాళ్లపల్లి ప్రశాంత్, దుర్గం అరుణ, బాలగోని మహేశ్వరి, ఈర్ల కోమల, మెరుగు అంజలి ఉన్నారు.



చెత్తను సేకరిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: రానున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యామ్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని డివిజన్ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బొట్ల మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో మాట తప్పి దగా చేసిందన్నారు. ఈనెల 21న జనగామలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, తదితర అనుబంధ సంఘాల సన్నాహక సమావేశం ఉందని, సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాయకులు గోవిందు ఇసాక్, నలిమెల నాగరాజు, గాదె శ్రీధర్, ఆరూరి శ్రీనివాస్, గుర్రం నవీన్, సంపత్, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే జఫర్‌గఢ్ మండల కేంద్రంలో తాటికాయల హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మడిపల్లి శ్యామ్ పాల్గొని మాట్లాడారు. అరూరి శ్రీను, గాదె శ్రీధర్, బల్లెపు నరేష్, బండ్ల అనిల్, బొడ్డు జెకర్యా, తాటికాయల బాబు, రామస్వామి, స్వామితోపాటు తదితరులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న మడిపల్లి శ్యామ్

వర్గీకరణతోనే అసమానతలు తొలుగుతాయి

దేవరుప్పుల: ఎస్సీ వర్గీకరణతోనే ఆర్థిక అసమానతలు తొలిగిపోతాయని మహాజన సోషలిస్టు పార్టీ మండల ఇన్‌చార్జ్ సందెన రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకుడు కొంగరి రాములు అధ్యక్షతన ఈ నెల 21 జనగామలో తలపెట్టిన విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వాన ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం కొనసాగుతున్న పోరాటం ద్వారానే మాదిగలకు ఆత్మగౌరవం పెరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు చింత యాదగిరి, జోగు రామచంద్రు ,ఉప్పుల ఉమేష్ ,పరుశురాములు, ,ఇస్తారి, రవి, సుదర్శన్, విజయ్, గణేష్,విజయ్‌కాంత్, సాయి, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సేవ్యతండా రోడ్డు



చిల్పూరు: మండలంలోని గార్లగడ్డ తండా పంచాయతీ పరిధిలోని సేవ్య తండా రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలు పడినప్పుడల్లా తండావాసుల అవస్థలు వర్ణనాతీతం. ఈ తండా ఫత్తేపూర్ పంచాయతీ పరిధినుంచి 3 కిలోమీటర్ల దూరం ఉండగా, గార్లగడ్డతండా పంచాయతీ నుంచి 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడ 15 వరకు ఇళ్లు ఉండగా దాదాపు 40 మంది జనాభా ఉన్నారు. చిన్నవర్షం పడినా తమకు కాలినడకే శరణ్యమని తండావాసులు వాపోతున్నారు. ఇక్కడకు ఎన్నికల సమయంలోనే నాయకులు, అధికారులు వస్తారే తప్ప ఆ తర్వాత ఎవరూ కనిపించరు. తమ సమస్యలను ఇటీవల ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డికి తెలిపితే రోడ్డు మంజూరు చేస్తామని హామీలు ఇచ్చారే తప్ప ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి భారీ వర్షాలు పడక ముందే రోడ్డు పనులు చేపట్టాలని తండావాసులు మాలోతు మల్లేష్, దేవి, లింగ, నునావత్ సుమన్, శివ, లక్ష్మ, శాల, విష్ణు, బాలాజీ, గణేష్, రాజేశ్వరి కోరుతున్నారు.

ఎర్రబెల్లి ట్రస్ట్ తోడ్పాటును వినియోగించుకోవాలి




డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు

దేవరుప్పుల: సమాజ హితం కోసం ఎర్రబెల్లి ట్రస్టు తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సౌజన్యంతో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. రోడ్డు నిబంధనలు పాటించేందుకు దోహదపడే డ్రైవింగ్ లైసెన్స్‌ను యువత విధిగా పొంది ఉండాలనే సంకల్పంతో రాజకీయాలకతీతంగా ఇప్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన యువత బీఆర్‌ఎస్ మండల కార్యాలయంతోపాటు ఆయా గ్రామాల పార్టీ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. పాలకుర్తి నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుండె రమేష్, సోషల్ మీడియా అధ్యక్షులు దాసగాని భరత్, యూత్ ఉపాధ్యక్షులు మహమ్మద్ యాకుబ్ పాషా, భాషిపాక కృష్ణ,రాజు, పరిపూర్ణచారి, ఎర్రయ్య, స్మామాట్, ప్రదీప్, నరేష్, కిరణ్ కుమార్,సురేష్,మహేష్, నవీన్ పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

నర్మెట: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడతాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. సోమవారం మండలంలోని మచ్చుపహాడ్‌లో బేజాడి ట్రస్ట్ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ కిట్లను అందించారు. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ నవీన్‌కుమార్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, లింగరాజు, అఫ్జల్ ఉన్నారు.



క్రికెట్ కిట్లు అందజేస్తున్న బేజాడి బీరప్ప

ఆలయ అభివృద్ధికి విరాళాల అందజేత

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలను అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ శివరాత్రి రాజనర్సు తెలిపారు. సోమవారం గ్రామంలో కమిటీ సభ్యులతో కలిసి తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతల నుంచి చందాలను వసూలు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి రేషన్ కార్డు దారుడు రూ.4 వేలను తప్పకుండా చెల్లించాలని గ్రామ అభివృద్ధి కమిటీ తీర్మానం చేసిందని చెప్పారు. జంగిలి సాయిబాబా, రమాదేవి దంపతులు రూ.11వేల విరాళం అందజేశారు. జంగిలి ఆంజనేయులు, రాపెల్లి జనార్ధన్, కొప్పురవు శ్రీనివాస్‌రెడ్డి, గౌరారం కనుకయ్య, ఏర్రోజు శ్రీనివాస్, రాపెల్లి చక్రపాణి , గూడెముల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాత సాయిబాబా

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



అన్నదానం చేస్తున్న శ్రవణ్, మంజుల తదితరులు

రఘునాథపల్లి: సేవా కార్యక్రమాలతో నిజమైన సంతృప్తి లభిస్తుందని మహాదేవస్వామి ఆలయ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ అన్నారు. సోమవారం అమావాస్యను పురస్కరించుకొని స్వర్గీయ గండె బుచ్చయ్య–విజయలక్ష్మి స్మారకార్థం వారి కుమారుడు గందె శ్రవణ్–మంజుల దంపతులు మండలకేంద్రంలోని మహాదేవస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ సమాజంలోని ఉన్నత వర్గాలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రతి నెల అమావాస్య రోజున ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆలయ అర్చకులు పిండిపోలు శ్రీనివాస్‌శర్మ, కూరెళ్ల వేదకుమార్, వినయ్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు చింతకింది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి'



పాలకుర్తి టౌన్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగల సందీప్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. పాలకుర్తిలో హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు ధరవత్ రాజేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావు ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త పాటుపడాలన్నారు. హమ్యానాయక్, గిరగాని కుమారస్వామి, ధరావత్ సురేష్; మాచర్ల ప్రభాకర్,జక్కుల ఇంద్రారెడ్డి, ముద్దసాని సురేష్, మదాసు హరీష్ పాల్గొన్నారు.